

ఆప్కోకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

## వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు : సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా నిలిచిపోయిన ట్రంక్‌లైన్ పనులను త్వరలోనే చేపట్టి వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ ఆప్కోకాలనీలో నెలకొన్న సమస్యలపై కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శనివారం ఆ కాలనీలో పర్యటించారు. కాలనీలో విజయదుర్గ గేటెడ్ కమ్యూనిటీకి చెందిన వారు ప్రహరీ నిర్మించడం వల్ల తమ ఇళ్లల్లోకి పాములు, ఇతర కీటకాలు వస్తున్నాయని, వర్షాల కారణంగా కాలనీలో వరదనీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యేకు కాలనీవాసులు విన్నవించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూసీ నుంచి ఆప్కోకాలనీ వరకు విస్తరించాల్సిన ట్రంక్‌లైన్ పనులు కొన్ని అనివార్య కారణాల వల్ల ఇంద్రప్రస్థకాలనీ వరకు మాత్రమే కొనసాగి అసంపూర్తిగా నిలిచిపోయాయని, త్వరలోనే మూసీ వరకు ఈ ట్రంక్‌లైన్ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, సీనియర్ నాయకుడు అనంతుల రాజారెడ్డి, నాయకులు రవి, కాలనీ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డి, అంకారాజు, వెంకట్, చిరంజీవులు పాల్గొన్నారు.



ఔట్‌డోర్ జిమ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

## ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఔట్‌డోర్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ పవన్‌కుమార్ తెలిపారు. కొత్తపేట డివిజన్‌లోని ప్రజయ్ నివాస్ -1లో ఏర్పాటు చేసిన ఔట్‌డోర్ జిమ్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన ఔట్‌డోర్ జిమ్‌లో వ్యాయామం కోసం అన్ని సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నివాసాల చోటే ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ లింగాల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు సుందర్‌నారాయణ, గట్టు మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

## కుమ్మరికుంట చెరువులో గుర్రపు డెక్క తొలగింపు

హయత్‌నగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుమ్మరికుంట చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకులను సర్కిల్ ఎంటమాలజీ డిపార్టుమెంటు అధికారులు శనివారం తొలగించే పనులు మొదలుపెట్టారు. చెరువులో గుర్రపు డెక్క వల్ల విపరీతంగా దోమలు వృద్ధిచెందడంతో పాటుగా మురుగువాసన వస్తుందని స్థానికుల నుంచి ఫిర్యాదు అందుకున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులను కోరారు. అందులో భాగంగానే శనివారం ఎంటమాలజీ సిబ్బంది గుర్రపు డెక్క తొలగించే పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్, సూపర్‌వైజర్ సోర్‌కుమార్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



చెరువులో గుర్రపు డెక్కను తొలగిస్తున్న ఎంటమాలజీ డిపార్టుమెంటు సిబ్బంది

## 24 నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి అక్టోబరు 3 వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశీరెడ్డితో కలిసి బ్రహ్మోత్సవ కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కాలనీవాసులు, భక్తుల సహకారంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలను ప్రతి ఒక్కరూ సోదరభావం, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కో.చైర్మన్ కె.ఎల్.గణపతి, వైస్ చైర్మన్ ఆర్.జగదీశ్‌కుమార్, బి.వి పాపారావు, కె.సత్తయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.




ఉదయ్‌భాను చిబ్‌ను సత్కరించిన జక్కిడి శివచరణ్‌రెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

## మర్యాదపూర్వక కలయిక

మన్సూరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌భాను చిబ్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శివచరణ్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆదివారం ఎల్బీనగర్ సెంట్రల్‌బ్యాంక్‌కాలనీలోని వారి నివాసానికి విచ్చేసిన ఉదయ్‌భాను చిబ్‌ను జక్కిడి కుటుంబం శాలువాతో సన్మానించారు. కాలనీలోని ఉమారామలింగేశ్వర ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సయ్యద్ ఖలీద్, కో-ఇన్‌చార్జిలు కేఆర్ భవ్య, రోష్ని కుశాల్ జైస్వాల్ పాల్గొన్నారు.

## బీజేపీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా పనిచేద్దాం

మన్సూరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే ధ్యేయంగా కలిసికట్టుగా పనిచేద్దామని ఆ పార్టీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. హస్తినాపురం డివిజన్‌లోని వివిధ కాలనీలకు చెందిన ఎస్టీ సంఘాల నాయకులు శనివారం ఎల్బీనగర్ అసెంబ్లీ కార్యాలయంలో సామ రంగారెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువాలు కప్పిన ఆయన పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ హస్తినాపురం అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, జీవన్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, మునీల్‌నాయక్, మల్లేష్‌యాదవ్, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



కుట్టు శిక్షణ మహిళలతో సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్

## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ వినాయకనగర్ కాలనీలో పీపుల్స్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శనివారం సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిక్కెర గోపీశంకర్‌యాదవ్ సందర్శించారు. కుట్టు శిక్షణకు సంబంధించిన వివరాలను నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. అనంతరం గోపీశంకర్‌యాదవ్ మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదిగి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. ఉచిత కుట్టు శిక్షణ అవకాశాన్ని కాలనీ మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీపుల్స్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు దుంపాల సారిక, టీచర్ స్వప్న, సామాజిక కార్యకర్త హేమలత, సురక్ష సభ్యులు యాకుబ్, అంజద్, శిక్షణ పొందుతున్న మహిళలు పాల్గొన్నారు.



హయత్‌నగర్ కోర్టులో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పాల్గొన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మా ఫాతిమా



జాతీయ లోక్‌అదాలత్‌లో ఒప్పంద అవార్డును ఇరుపక్షాలకు అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్

### కేసుల సత్వర పరిష్కారానికి

# లోక్‌అదాలత్ ఉత్తమ మార్గం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్**

రంగారెడ్డి జిల్లా కోర్టులు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్ ఉత్తమ మార్గమని రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రంగారెడ్డి జిల్లాలోని అన్ని కోర్టుల ప్రాంగణాలలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ బెంచ్‌లను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సత్వరం న్యాయం పొందవచ్చన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సివిల్ కేసుల్లో చెల్లించిన కోర్టు ఫీజులు కూడా తిరిగి పొందవచ్చన్నారు. ఆస్తిపరమైన, కుటుంబ సమస్యల కేసులు పరిష్కరించుకోవడానికి లోక్‌అదాలత్, మధ్యవర్తిత్వం ఒక చక్కటి వేదికన్నారు. లోక్‌అదాలత్‌లో కేసును రాజీ చేసుకోవడం ద్వారా ఇరువర్గాలు గెలిచినట్లేనన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీవాణి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టు ప్రాంగణాలలో 30 లోక్‌అదాలత్ బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో రాజీకి ఆమోదయోగ్యమైన క్రిమినల్ కేసులు, సివిల్ దావాలు, చెక్‌బౌన్స్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా కేసులు, వినియోగదారుల కోర్టు కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించుకోవడం జరిగిందన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌లో దీపక్ అను వ్యక్తి ఐసీఐసీఐ బ్యాంకు నుండి రూ.1,56,45,118లు రుణముగా తీసుకున్నారు. ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో అతను విఫలమైనందున ఐసీఐసీఐ బ్యాంకు రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ప్రీ లిటిగేషన్ కేసు దాఖలు చేసింది. ఆపై చర్చల అనంతరం ప్రతివాదిగా ఉన్న దీపక్ ఐసీఐసీఐ బ్యాంకుకు రూ. 1,12,00,000లు చెల్లించడానికి అంగీకరించాడు. దీంతో ఇరుపక్షాల మధ్య వివాదం పరిష్కారం అయ్యింది. ఇరుపక్షాల మ ధ్య కుదిరిన ఒప్పందంపై జారీ చేయబడిన అవార్డును రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కర్ణకుమార్ ఇరుపక్షాలకు అందజేశారు. శనివారం నాటి జాతీయ లోక్‌అదాలత్‌లో సుమారు 18,068 పైచిలుకు కేసులు పరిష్కరించబడ్డాయని కార్యదర్శి శ్రీవాణి తెలిపారు. అన్ని కేసులలో కలిపి మొత్తం రూ. 21,78,05,546ల వరకు నష్టపరిహారాన్ని కక్షిదారులకు ఇప్పించడం జరిగిందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ కోర్టులో 5,731 కేసులు రాజీ

హయత్‌నగర్ : హయత్‌నగర్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా హయత్‌నగర్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 5,731 కేసులలో కక్షిదారులు రాజీ కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో 14వ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సల్మాఫాతిమా, ఏడవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్ బేగం, స్పెషల్ కోర్టు మేజిస్ట్రేట్ లక్ష్మణ్‌రావు, ఏపీపీ లావణ్యకుమార్, వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అశోక్‌రెడ్డితో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంలో ప్రతి పేదవాడికీ న్యాయం చేస్తాం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో నియోజకవర్గంలోని ప్రతి పేదవాడికి న్యాయం చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, చిన్నరావిరాల, ఇనాంగూడ, మజీద్‌పూర్ గ్రామాల్లో రూ.76లక్షలతో చేపట్టనున్న పలు పనులకు మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలుచేసి చూపిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగానే పథకాల అమలులో కొంత ఆలస్యం జరిగిందన్నారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం హౌసింగ్ కాలనీవాసులకు కూడా ఉచిత విద్యుత్ పథకం వర్తిస్తుందన్నారు. కాలనీలో నివాసం ఉంటున్న వారు ఎవ్వరు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవద్దని సూచించారు. ప్రభుత్వ పథకంలో భాగంగా కాలనీలో ఇళ్లు పొంది ఇక్కడ నివాసం ఉండకుండా అద్దెకు ఇచ్చిన వారిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దెకు ఉంటున్న వారెవ్వరు కిరాయి చెల్లించవద్దని వారికి సూచించారు. కిరాయికి ఉంటున్న వారికే ఇంటిని కేటాయిస్తామని తెలిపారు. ప్రతీ ఒక్క లబ్ధిదారుకు న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, పంచాయతీరాజ్ ఏఈ సూర్యతేజ, ఏఎంసీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మాజీ జడ్పీటీసీ దేవదాసుగౌడ్, మాజీ సర్పంచ్‌లు చిత్తారి, వెంకటేష్‌కరిమెల, శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు శివశంకర్‌గౌడ్, మందుగుల శ్రీశైలంగౌడ్, రమేష్‌గౌడ్, కోట ప్రభాకర్‌రెడ్డి, రాముయాదవ్, రవియాదవ్, సాంబశివగౌడ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

## క్రీడాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి : మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రీడాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నదని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. శనివారం కొత్తపేటలోని సురభి ఎలైట్‌లో జరిగిన తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. రాష్ట్రంలో కొత్తగా స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతున్నదన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు, యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా పాలసీని తీసుకొస్తున్నదన్నారు. హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్‌రెడ్డి రాంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయనను అసోసియేషన్ ప్రతినిధులందరూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, శ్యామల పవన్‌కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రతినిధులు సోలిపురం వెంకట్‌రాంరెడ్డి, తిరుమల్‌రెడ్డి, ఆదిలాబాద్ కార్యదర్శి కనపర్తి రమేష్, డి. రామలింగం, కరీంనగర్ కార్యదర్శి బి. లక్ష్మణ్, ప్రభాకర్, హైదరాబాద్ కార్యదర్శి సంజీవ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నిజామాబాద్ కార్యదర్శి పి. సురేందర్, మెదక్ కార్యదర్శి విజయ్‌బాబు, మల్లేష్, నల్గొండ కార్యదర్శి పుల్లమ్మ, మహబూబ్‌నగర్ కార్యదర్శి ఆర్. శంకర్ పాల్గొన్నారు. ఈ ఎన్నికలకు భారత హ్యాండ్ బాల్ ఫెడరేషన్ పరిశీలకుడు శ్యాంసుందర్ రెడ్డి, రిటర్నింగ్ అధికారిగా శ్యాంప్రసాద్ వ్యవహరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, అరుణ్ అంబేద్కర్, శ్యాం, అస్లాం తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మల్‌రెడ్డి రాంరెడ్డితో సంఘం ప్రతినిధులు

## నెంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై పోలీసుల స్పెషల్ డ్రైవ్

కొత్తపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నెంబర్ ప్లేట్లు సరిగా లేకుంటే సమస్యలు తలెత్తే ప్రమాదముందని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధి ఇబ్రహీంపట్నం, ఎల్బీనగర్, వనస్థలిపురం ట్రాఫిక్ పీఎస్‌ల పరిధిలో నెంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్, నెంబర్ సరిగా లేని వాహనాలను గుర్తించడానికి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నెంబర్లు సరిగా లేని వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలా పట్టుబడిన 230 మంది వాహనదారులకు శనివారం పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్ హాల్‌లో టీటీఐ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలుత వారికి ఐటీ సెల్ వారు ప్రత్యేకంగా సేకరించిన వీడియో క్లిప్స్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ వాహనాల తనిఖీలు, చలానాలు తప్పించుకునేందుకు, సీసీ కెమెరాలకు దొరకకుండా కొందరు నెంబర్స్ కనిపించకుండా ప్లేట్లను వంచేస్తుంటారని గుర్తు చేశారు. దొంగతనాలు చేసి పరారయ్యేవారు కూడా నెంబర్లు మార్చేస్తూ నేర నియంత్రణను తప్పుదోవపట్టిస్తుంటారని పేర్కొన్నారు. పోలీసుల నుండి తప్పించుకునేందుకు కొందరు అపరిచితులు కూడా వాహనాల నెంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేస్తుంటారని తెలిపారు. నెంబర్ ప్లేట్లు నేర నియంత్రణలో నిర్దిష్టమైన పాత్ర పోషిస్తాయని వివరించారు.




నెంబర్ ప్లేట్లు సరిగా లేకుంటే తలెత్తే సమస్యలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్

## సాయుధ పోరాటంలో నెత్తుటి మరకలకు 77 ఏళ్లు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులు చిందిన నెత్తుటి మరకలకు 77ఏళ్లు పూర్తి అయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి అన్నారు. రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా శనివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారంలోని ఆర్‌కేనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి రవీంద్రాచారి, ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ముత్యాల యాదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఐ జెండా ఎగురవేసి సాయుధ పోరాటంలో అమరులకు నివాళులర్పించారు. అనంతరం రవీంద్రాచారి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చిన ఏడాది తర్వాత నిజాంపాలన నుంచి విముక్తి పొంది తెలంగాణకు స్వాతంత్రం వచ్చిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మొదలైన తెలంగాణ సాయుధ పోరాటంలో అనేక మంది తమ రక్తం చిందించారని తెలిపారు. అప్పటి పోరాట స్ఫూర్తిని నేటితరం కొనసాగించాలన్నారు. ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ సాయుధ పోరాటానికి, బీజేపీకి ఎలాంటి సంబంధం లేదని తెలంగాణ ప్రజల అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి అజ్మీర్ హరిసింగ్‌నాయక్, రాజుగౌడ్, సైదులు ముదిరాజ్, గోపీ, శ్రీలత, నర్సింహ, ఉప్పలయ్య, కనకయ్య, శోభన్‌బాబు, మల్లేష్, యాకయ్య, శైలజ, మల్లిశ్వరీ, శ్రీకాంత్, ప్రభాకర్, రమేష్, చాంద్ పాల్గొన్నారు.



అమరులకు నివాళులర్పిస్తున్న రవీంద్రాచారి, యాదిరెడ్డి తదితరులు

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక చారిత్రక మలుపు

- ప్రముఖ వక్త, ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్

హయత్‌నగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ఒక చారిత్రక మలుపని ప్రముఖ వక్త, ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అబ్బాస్ అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లోని అరుణ కన్వెన్షన్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం- వాస్తవాలు వక్రీకరణలు అనే అంశంపై రంగారెడ్డి జిల్లా టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ వక్త, ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అబ్బాస్ మాట్లాడుతూ 1946 సెప్టెంబరు 11న ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట పిలుపు ఒక చారిత్రక మలుపని పేర్కొన్నారు. ప్రజలపై నిజాం ప్రభుత్వం, రజాకార్లు జరిపిన దమనకాండకు ఎదురొడ్డి నిలిచిన ఏకైక పార్టీ కమ్యూనిస్టు అని అన్నారు. ఆనాడు జరిగిన విషయాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. మేధావులు మౌనంగా ఉంటే చరిత్ర వక్రీకరించే అవకాశం ఉంటుందన్నారు. ఆనాడు జరిగిన విషయాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. నిజాం ప్రభుత్వ అరాచకాలు, రజాకార్ల దాడులపై కమ్యూనిస్టు పార్టీ తిరుగుబాటు చేసి ప్రజలకు రక్షణగా నిలిచిందన్నారు. రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరిచిపోలేనివని వివరించారు. భూస్వాముల వేధింపుల నుంచి ప్రజలను కాపాడడానికి కమ్యూనిస్టులు ఎన్నో త్యాగాలు చేశారని గుర్తు చేశారు. విముక్తి అంటే ఏమిటి- విలీనం అంటే ఏమిటి, విమోచనం అంటే ఏమిటి అనే విషయాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంగయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్పయ్య, నాయకులు రాములయ్య, సుగంధ, సీఐటీయూ నాయకులు కిషన్, కస్నానాయక్, రాములయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.




సెమినార్‌లో మాట్లాడుతున్న ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షుడు అబ్బాస్

## కర్నాటక సీఎంను కలిసిన ఉప్పల

మన్సూరాబాద్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బెంగళూరులోని ఆయన అధికారిక నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి సిద్దరామయ్యను కలిసిన ఉప్పల ఆయనతో పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్య ఇచ్చిన పలు సూచనలు, సలహాల పట్ల శ్రీనివాస్‌గుప్తా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా సతీమణి ఉప్పల స్వప్న, కుమారులు సాయికిరణ్, సాయితేజ, కోడలు శర్వరీసాయికిరణ్ పాల్గొన్నారు.



సీఎంను జ్ఞాపికతో సత్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఆయన కుటుంబ సభ్యులు

## కాలనీల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా

సరూర్‌నగర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. అల్మాస్‌గూడ 5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీలో డ్రైనేజీ సమస్యతో మ్యాన్‌హోళ్లు నిండిపోయి మురుగునీరు రోడ్లపైకి, ఇళ్లలోకి వస్తుండడంతో కాలనీవాసులు ఈ సమస్యను రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన శనివారం కాలనీని సందర్శించి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ సరస్వతితో పాటు మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, మాజీ మేయర్ పారిజాతానర్సింహారెడ్డికి ఫోన్‌చేసి సమస్యను వివరించారు. దాంతో వారంతా వెంటనే స్పందించి కాలనీకి గల్పర్ మెషీన్ పంపించారు. రాఘవేందర్‌రెడ్డి అక్కడే ఉండి డ్రైనేజీ మొత్తం శుభ్రం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, తాము అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రాజవర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంజీబీఎస్ నుంచి బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ చందాపూర్‌కు ఏసీ బస్సులు

చాదర్‌ఘాట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎంజీబీఎస్ నుంచి బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ చందాపూర్‌కు ఏసీ లహరి బస్సులను ప్రారంభించినట్లు హైదరాబాద్-1 డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. నగరంలోని ఈసీఐఎల్, నేరెడ్‌మెట్ నుంచి బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ చందాపూర్‌కు ఏసీ బస్సు లు రాకపోకలు సాగించనున్నాయని ఆయన వివరించారు. ప్రతి రోజు సాయంత్రం 6గంటలకు జేబీఎస్ నుంచి 6.30గంటలకు నేరెడ్‌మెట్ నుంచి రాత్రి 9గంటలకు ఎంజీబీఎస్ నుంచి ఏసీ బస్సులు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 9.20గంటలకు బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ చందాపూర్‌కు చేరుకుంటుందన్నారు. తిరిగి చందాపూర్ నుంచి రాత్రి 7గంటలకు బయల్దేరి బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ మీదుగా మరుసటి రోజు ఉదయం 7.20గంటలకు ఎంజీబీఎస్‌కు, 7.45గంటలకు నేరెడ్‌మెట్‌కు చేరుకుంటుందని డిపో మేనేజర్ వివరించారు.

## శ్రీరామ్‌నగర్‌కాలనీలో కొండచిలువ ప్రత్యక్షం

- మట్టిరోడ్డు దాటుతూ కాలనీవాసుల కంటపడిన కొండచిలువ
- భయాందోళనలో కాలనీవాసులు



శ్రీరామ్‌నగర్‌కాలనీలో మట్టిరోడ్డును దాటుతున్న కొండచిలువ

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 2వ వార్డు పసుమాముల శ్రీరామ్‌నగర్‌కాలనీలో కొండచిలువ ప్రత్యక్షమైంది. మూడు రోజుల క్రితం రాత్రి 6గంటల సమయంలో సుమారు 10అడుగుల పొడవు గల కొండచిలువ నెమ్మదిగా మట్టిరోడ్డు దాటుతూ కాలనీవాసుల కంటపడింది. ఒక్కసారిగా దాన్ని చూసిన కాలనీవాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దాన్ని పట్టుకునేందుకు పలువురికి ఫోన్‌చేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే అది సమీపంలోని చెట్లపొదల్లోకి వెళ్లిపోయింది. కొన్ని రోజులుగా ఇక్కడ రెండు, మూడు కొండచిలువలు తిరుగుతున్నాయని కాలనీకి చెందిన పలువురు తెలిపారు. ఇటీవల మున్సిపల్ వాటర్‌మ్యాన్‌కు కూడా ఒకసారి కనిపించిందని చెప్పారు. అది కనిపించినప్పటి నుంచి కాలనీవాసులు భయాందోళనకు గురువుతున్నారు. రాత్రి సమయంలో ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కాలనీ వెనుకవైపున డ్రైనేజీ మురుగు నాలాతో పాటు చెరువు ఆనుకుని ఉండడంతో అక్కడ పెద్దఎత్తున చెట్లుపెరిగి నిర్మానుష్య ప్రాంతంగా తయారయిందని కాలనీవాసులు తెలిపారు. కొండచిలువను పట్టుకునే విషయంలో అధికారులు చొరవతీసుకోవాలని కోరుతున్నారు.